ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024 | 5



ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	27

అల్లవరం మండలం
గూడాలలో అగ్ని ప్రమాదం
మూడు తాటాకిళ్లు దగ్ధం... రూ.9 లక్షలు ఆస్తి నష్టం... 7లో



అయినవిల్లి మండలం పోతుకుర్రులో పక్వ దశకుచేరిన వరిచేలు



భూసార పరిరక్షణకు, అదనపు ఆదాయం కోసం మూడో పంటగా అపరాలు, పచ్చిరొట్ట పైర్లు సాగు చేపట్టాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు పదేపదే చెప్తున్నారు. అయితే ఆ దిశగా వారిని ప్రోత్సహించే చర్యలు మాత్రం చేపట్టడం లేదు. రబీ అనంతరం వేసవిలో మూడో పంటగా సాగు చేసేందుకు రైతులకు అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు ఎంతమేర అవసరమో క్షేత్రస్థాయి అధికారులు ఇండెంట్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదించడానికే పరిమితం అవుతున్నారు. నాలుగైదేళ్లుగా వాటిని సకాలంలో అందించిన దాఖలాలు లేవు.

మూడో పంట సాగు లేనట్టేనా!

- అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు కేవలం ఇండెంట్‌కే పరిమితం
- ప్రకటనలతో సరిపెడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని వాపోతున్న రైతులు
- బహిరంగ మార్కెట్లో కొనుగోలుకు అనాసక్తి

ముమ్మిడివరం, ఏప్రిల్ 14:

జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్లో 1,69,397 ఎకరాల్లో వరి సేద్యం జరిగింది. ఎంటీయూ-1121 రకం 60శాతం, ఎంటీయూ-3626 రకం 30 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం వరి పక్వ దశకు చేరుకుంది. మండపేట, రాయవరం, ఆలమూరు, ఆత్రేయపురం, మామిడికుదురు, అయినవిల్లి తదితర మండలాల్లో సుమారు 2,900 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. మరో వారంలో కోతలు ముమ్మరంగా చేపట్టే అవకాశం ఉంది. 50శాతం రాయితీపై రైతులకు పెసర, మినుములు, పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జీలుగ, జనుము సరఫరాకు రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఇండెంట్‌లు పెట్టినా ఇంతవరకు విడుదల కాలేదు. వరి కోతలు పూర్తయిన తర్వాత అవి వచ్చినా ఉపయోగం ఉండదు. బహిరంగ మార్కెట్లో మినుములు, పెసలు కిలో రూ.170 నుంచి రూ.180 విక్రయిస్తున్నారు. పిల్లిపెసర కిలో రూ.180 నుంచి రూ.190, జీలుగ రూ.80 నుంచి రూ.90 వరకు, జనుములు కిలో రూ.80 నుంచి రూ.90కు అమ్ముతున్నారు. దీంతో ఎక్కువ ధర పెట్టి వీటిని కొనుగోలు చేసేందుకు రైతులు అంతగా ఇష్టపడడం లేదు. ప్రభుత్వం 50శాతం రాయితీపై సరఫరా చేస్తే సాగు చేయడానికి వీలుంటుంది. రాయితీపై సమకూర్చకపోవడంతో మూడో పంటగా సాగు చేయలేకపోతున్నారు. దీంతో భూసారాన్ని పరిరక్షించాలన్న శాస్త్రవేత్తల సూచనలు కేవలం ప్రచారానికే పరిమితం అవుతున్నాయి. రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, అపరాలు రైతులకు సరఫరా చేయాలని ఉన్నత స్థాయి అధికారులు, ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు.

ఇండెంట్ పెట్టి నెల అయ్యింది

బొబ్బిలి నాగభూషణం, రైతు



నాకు మూడు ఎకరాల వరి చేను ఉంది. పిల్లిపెసర, జీలుగ విత్తనాలకు నెల క్రితం రైతు భరోసా కేంద్రంలో ఇండెంట్ పెట్టాను. ఇప్పటివరకు ఇవ్వలేదు. వారంలో వరి చేను కోతకు వస్తుంది. కోతలు పూర్తయ్యాక వాటిని ఇచ్చినా ప్రయోజనం ఉండదు.

గతంలో నెల ముందు ఇచ్చేవారు

మోటూరి మోహనరావు, రైతు



గతంలో మినుములు, పెసర, పిల్లిపెసర, జీలుగ విత్తనాలను వరి కోతలకు నెల ముందుగానే వ్యవసాయ శాఖ కార్యాలయంలో సిద్ధంగా ఉంచేవారు. నాలుగైదు ఏళ్లుగా కోతలు పూర్తయ్యాక విత్తనాలు వచ్చాయంటున్నారు. దీనివల్ల రైతులు వాటిని తీసుకువెళ్లలేకపోతున్నారు.

ప్రోత్సాహం లేదు

గుత్తుల వీర వెంకట సత్యనారాయణ



రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. గతంలో వ్యక్తిగతంగా సబ్సిడీపై యంత్ర పరికరాలు, విత్తనాలు ఇచ్చేవారు. ప్రస్తుతం రైతు గ్రూపులకు మాత్రమే రాయితీపై యంత్ర పరికరాలు ఇస్తున్నారు. దీనివల్ల ఎటువంటి ఉపయోగం ఉండట్లేదు.

విత్తనాలను సకాలంలో ఇవ్వాలి

గుబ్బల వెంకటేశ్వరరావు, రైతు



పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై సకాలంలో అందించాలి. అప్పుడే రైతులు వాటిని సాగు చేయగలుగుతారు. ఇటీవలి కాలంలో వరి కోతలు ఆలస్యం కావడం, విత్తనాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో మూడో పంట వీలుపడట్లేదు. గతంలో మూడో పంటగా అపరాలు సాగుచేస్తే ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేలు ఆదాయం వచ్చేది. రైతుకు ఎంతో ఉపయోగంగా ఉండేది. మూడో పంట సాగు లేక వ్యవసాయంలో గిట్టుబాటు కరువైంది.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

ప్రపంచ దేశాలకు ఆదర్శనీయుడు అంబేడ్కర్

అమలాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచి భారతీయులకు దిక్సూచిగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేనప్పటికీ ఆయన రచించిన రాజ్యాంగం ఆదర్శంగా నిలిచిందన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన కాంస్య విగ్రహానికి ఆదివారం కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళల సాధికారత కోసం, హక్కుల కోసం పోరాడిన యోధుడిగా అంబేడ్కర్‌ను కీర్తించారు. అణగారిన వర్గాల్లో అక్షర దారి నింపిన మహనీయుడన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందేలా అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేశారన్నారు. సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ ఎస్.శ్రీధర్, అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా పూలమాలలువేసి నివాళులర్పించారు. కుల నిర్మూలన కోసం పోరాడిన మహనీయుడని, భారత రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీధర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి సత్యానందరావు

‘బండారు’కు బాసట

- హైదరాబాద్ నిజాంపేటలో ప్రాంతీయ సమ్మేళనం
- భారీగా తరలివచ్చిన కొత్తపేట నియోజకవర్గ ఓటర్లు
- కూటమి అభ్యర్థి సత్యానందరావుకు మద్దతు ప్రకటన

ఆత్రేయపురం, ఏప్రిల్ 14: ఉపాధి కోసం వెళ్లి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావుకు అపూర్వ స్వాగతం పలికారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక, వ్యాపారరంగాలతో పాటు వివిధ ఉద్యోగాల నిమిత్తం నివాసముంటున్న సుమారు 3,500 మంది ఓటర్లతో నిజాంపేటలోని సప్తపది గార్డెన్స్‌లో ఆదివారం ప్రాంతీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి సత్యానందరావుతో పాటు జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు హాజరయ్యారు. జయజయ ధ్వానాలతో సత్యానందరావుకు సంఘీభావం ప్రకటించారు. కూటమి అభ్యర్థికే తమ మద్దతు అంటూ ప్రసంగాలతో హోరెత్తించారు. తుగ్లక్ ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాజధాని లేని రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక పరాయి రాష్ట్రంలో పడరానిపాట్లు పడుతున్నామని యువకులు బండారు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి ఒక్క రాజధాని కూడా నిర్మించకపోవడంతో ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోందని వారు వాపోయారు. అభ్యర్థి బండారు సత్యానందరావు మాట్లాడుతూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిని ఏపీ రాజధానిగా చేయడంతో పాటు విశాఖను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఉమ్మడి పార్టీలకు చెందిన నాయకులు, ఓటర్లు సందడి చేశారు.



సమావేశానికి హాజరైన ఓటర్లు



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బోళ్ల వెంకట కృష్ణప్రసాద్

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు... 8లో

నజరానా!

- వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుకు మట్టి మాఫియా కాంట్రాక్టర్ల ముడుపులు
- వందలాది లారీల్లో అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు
- కళ్ల ముందే తరలిపోతున్నా అధికారుల చోద్యం
- వారికీ భారీగానే ముడుతున్నాయని టీడీపీ, జనసేన నేతల ఆరోపణ
- ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలా అవుతున్నాయంటున్న సామాన్యులు



పి.గన్నవరం మండలం మానేపల్లిలో గోదావరి మధ్యలో ఇసుక తవ్వకం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అధికార వైసీపీ అభ్యర్థులకు జిల్లాలోని కీలకమైన ఇసుక, మట్టి ర్యాంపులను అధికారులు నజరానాగా ఇచ్చారు. ఒకవైపు ఎన్నికల ప్రచారం జరుగుతున్న తరుణంలో కూడా అధికారపక్ష అభ్యర్థులు వారి అనుచరగణాల జేబులు నింపే పనిలో కోనసీమ జిల్లాలోని కీలక అధికారులు నిమగ్నమయ్యారు. ఎటువంటి అనుమతులూ లేకుండా వశిష్ఠ, వైనతేయ, గౌతమి నదీపాయల్లో నిత్యం వందలాది లారీల ఇసుక, మట్టి అక్రమంగాతరలిపోతోంది. రావులపాలెం కేంద్రంగా ఉన్న కొందరు అధికార వైసీపీ నేతల సహకారంతో మట్టి మాఫియాకు చెందిన కాంట్రాక్టర్లు ఊబలంక, ఉడిమూడిలంక, మొండెపులంక, మానేపల్లి సహా అనేక ప్రాంతాల నుంచి నిత్యం వందల లారీల్లో ఇసుక, మట్టి తరలించుకుపోవడం ద్వారా కోట్ల పైబడి ఆదాయాన్ని అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఈ దందాలో భాగస్వామ్యం వహిస్తున్న రెవెన్యూ, పోలీసు, గనులు, భూగర్భ హెడ్‌వర్క్స్ అధికారులకు రోజువారీ భారీగా మామూళ్లు ముడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా నిరోధానికి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని సమాచారం. సామాన్యులు రూ.52వేలు తీసుకుని జీవనోపాధి నిమిత్తం సరుకు కొనుగోలుకు వెళ్తుంటే ఎన్నికల నిబంధనల పేరుతో ఏఎస్‌టీ, ఎస్‌ఎఫ్‌టీ స్క్వాడ్ తనిఖీల పేరుతో స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. నిత్యం అనధికారికంగా వందల లారీల్లో కళ్ల ముందే నల్ల బంగారం (మట్టి), బంగారంలాంటి ఇసుక తరలిపోతున్నా ఎన్నికల అధికారులు కన్నెత్తి చూసే సాహసమే చేయలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తూ కలెక్టర్ పర్యవేక్షణలో ఉండే అధికారులు సైతం ఈ దందాలను నిరోధించడంలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో మరో నెలలో ఎన్నికలు జరగనుండడంతో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎక్కడికక్కడే తనిఖీలు చేస్తున్నారు. నగదు, బంగారం, ఇతర సామగ్రి పెద్ద ఎత్తున తరలిపోతే పట్టుకునేందుకు ప్రత్యేక మొబైల్ టీములను ఏర్పాటుచేశారు. బిల్లులు లేకపోతే ఏ వస్తువునూ అనుమతించని అధికారులు ఇక్కడ మాత్రం అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక, మట్టి దోపిడీకి మాత్రం గ్రీన్‌సిగ్నల్ కొనసాగిస్తూనే ఉన్నారు. ఎక్కడా తనిఖీలు చేయకుండా రేయింబవళ్లు తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని గౌతమి నదిలో రావులపాలెం-ఊబలంక, గోపాలపురం, వైనతేయ నదిలో ఉడిమూడిలంక, మానేపల్లి, మొండెపులంకతో పాటు అనేక గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అంతర్వేది నుంచి యానాం వరకు ఉన్న సముద్ర తీరం వెంబడి ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నా ఎన్నికల కాలంలో కొరడా ఝుళిపించాల్సిన అధికారులు ఇంకా వారి కనుసన్నల్లోనే విధులు నిర్వరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పి.గన్నవరం మండలంలో మట్టి ఇసుక తవ్వకాలపై ఓ వ్యక్తి ఎన్నికల కమిషన్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాడు. దానిని చూసిన అధికారులు అక్కడికి వచ్చి కొన్ని గంటల పాటు తవ్వకాలు నిలుపుదల చేయించి వెళ్లిపోయారు. తర్వాత షరా మామూలుగానే మట్టి మాఫియా పేట్రేగిపోయింది. తిరిగి అదే వ్యక్తి ఈ అక్రమాలను నిరోధించడానికి పోలీసులు సహకరించాలంటూ పి.గన్నవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే దరఖాస్తు తీసుకుంటాం గానీ రశీదు ఇవ్వలేమంటూ చేతులెత్తేశారు. దీంతో మట్టి మాఫియా లాబీయింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మానేపల్లి, మొండెపులంకల్లో ప్రతిమ, సుధర్మ పేరుతో బిల్లులు ఇస్తున్నారు. వాటి ఆధారంగానే ఇష్టారాజ్యంగా గోదావరి ప్రవాహానికి అడ్డుకట్టలు వేసి బొండు ఇసుక ముసుగులో బంగారం లాంటి ఇసుకను తరలించుకుపోతున్నారు. హైవే నిర్మాణం పేరుతో కాంట్రాక్టు సంస్థ తరలిస్తున్న మట్టి, ఇసుక కూడా పక్కదోవ పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రావులపాలెం మండలం ఊబలంక ర్యాంపు అక్కడి వైసీపీ నేతలకు బంగారు కోడిపెట్టలా మారింది. ఇసుకను యథేచ్ఛగా తరలించుకుపోతున్నా పోలీసులు, రెవెన్యూ, ఎస్‌ఈబీ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం వెనుక అధికార వైసీపీ నేతల లాబీయింగ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఇలా అక్రమార్జన ద్వారా వచ్చే ఆదాయాల్లో రెండు, మూడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థులకు మట్టి మాఫియా కాంట్రాక్టర్లు ముడుపులు ముట్టచెప్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగానికి కూడా భారీగానే నజరానాలు అందడం వల్లే ఈ అక్రమాలను అడ్డుకోలేకపోతున్నారని టీడీపీ, జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. గన్నవరంలో టీడీపీ, జనసేనలకు చెందిన కొందరు నేతలు ఓ ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ప్రయత్నిస్తే వైసీపీ మాఫియా వారికి ఆదిలోనే అడ్డుకట్టవేసినట్టు సమాచారం.

కార్మికులకు ఉపాధి ఎక్కడ కల్పించారు!

కాగా ఇటీవల ర్యాంపులు మూసివేయడం వల్ల వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని కలెక్టరేట్ ఎదుట గగ్గోలు పెట్టిన కొత్తపేట వైసీపీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డితన ప్రాంతంలో జరుగుతున్న మట్టి, బొండు ఇసుక ర్యాంపుల తవ్వకాల్లో కూలీలను ఎందుకు వినియోగించట్లేదని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఉడిమూడిలంక, మానేపల్లి, మొండెపులంకల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతోనే తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడ ఎవరికీ ఉపాధి లేదు. గట్టిగా మాట్లాడే వ్యక్తిని నోట్ల కట్టలతో కట్టేస్తున్నారు. ఆందోళన చేసే నేతలను కేసుల పేరుతో భయందోళనకు గురిచేస్తున్నారు.





మొండెపులంకలో గోదావరి మధ్యలో ఎక్స్‌కవేటరుతో ఇసుక తవ్వకాలు



రావులపాలెం మండలం ఊబలంకలో మట్టి తవ్వకాలు

మొండెపులంకలో కొబ్బరితోటలో వేసిన బాటలోంచి లారీలో ఇసుక తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా

రూ.1.14లక్షల నగదు సీజ్, అక్రమ మద్యం స్వాధీనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద నిఘాను పటిష్ఠం చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనరు టి.నాగలక్ష్మీ పేర్కొన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను సమర్థవంతంగా అనుసరించాలన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మద్యం, నాటుసారా, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్‌ఈబీలో పనిచేస్తున్న ప్రతి అధికారి, సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.పోలింగ్ రోజున సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌ఈబీ అధికారులతో ఆమె పలు అంశాలపై సమీక్షించారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్‌ఈవో కె.రాజ్యలక్ష్మి, సూపరిండెంటెంట్ జి.అమర్‌బాబు, సత్యనారాయణ, వివిధ ప్రాంతాల ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో సాధించిన పురోగతిని ఖాదర్‌బాషా వివరించారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టీ బృందాలతో పాటు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా కోరంగి చెక్‌పోస్టు వద్ద రూ.1.14లక్షల నగదును సీజ్ చేసినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. ఎస్‌ఈబీ అధికారులు ముమ్మిడివరం, అమలాపురం, ఆలమూరు, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట ప్రాంతాల్లో నిర్వహించిన విస్తృత దాడుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు ఎన్‌డీపీ లిక్కర్ బాటిళ్లు, రెండు లీటర్ల ఐఎంఎల్, 39 డ్యూటీపెయిడ్ లిక్కర్ బాటిళ్లు, 7.02 లీటర్ల ఐఎంఎల్, 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఎనిమిది కేసులు నమోదు చేసినట్టు అడ్మిన్ ఎస్పీ ఖాదర్‌బాషా తెలిపారు. మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంటులో భాగంగా ముగ్గురిని అరెస్టు చేసి 15 డ్యూటీపెయిడ్ లిక్కరు బాటిళ్లు, 9.75 లీటర్ల ఐఎంఎల్, ఒక మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. ఐ.పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు చేసి ఐదు ఎన్‌డీపీ లిక్కరు బాటిళ్లు, 3.25 లీటర్ల ఐఎంఎల్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కేంద్ర బలగాలతో పోలీసులు ఆదివారం అమలాపురం పట్టణ పరిధిలోని కొంకాపల్లి, బుచ్చమ్మ అగ్రహారం, కురసాల వారి వీధి, బండివారిపేటల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కమిషనరు నాగలక్ష్మి

లోవకు పోటెత్తిన భక్తులు

» ఆలయానికి రూ.3.54 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, బారులు తీరిన భక్తులు

తునిరూరల్, ఏప్రిల్14: లోవదేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారు దేవస్థానం ఏర్పాటుచేసిన ఆరుబయట వంటషెడ్‌లలో, వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.3.54 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి

» విమర్శకుల నోళ్లు మూతబడ్డాయి

» మెగా అభిమానుల సమావేశంలో నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: రాష్ట్రంలో వైసీపీ పాలన అంతం కావాలంటే అన్ని శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంకు, ఐ బ్యాంకు ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అభిమానులు ఇక రాజకీయాల్లోనూ చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యకిరణ్(కత్తిపూడి బాబీ) ఆధ్వర్యంలో మెగా అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. చిరంజీవి జనసేనపార్టీకి రూ.5కోట్లును ప్రోత్సాహకంగా అందించడం సంతోషకరమైన విషయమన్నారు. చిరంజీవి మద్దతు జనసేనకు లేదనే విమర్శకుల నోళ్లు ఇప్పుడు మూతబడ్డాయని, ఆయన ఆశీస్సులు ఎప్పుడు జనసేనకు ఉంటాయని నాగబాబు తెలిపారు. చిరంజీవి మద్దతుతో జనసేన బలం రెట్టింపయిందని చెప్పారు. మెగా అభిమానులంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. తన వ్యక్తిగత సంపద దాచుకోకుండా కుల, మత, ప్రాంతీయ ఆలోచనలు లేకుండా సమాజంపట్ల బాధ్యతగా ఎన్నో ప్రజోపయోగకరమైన సేవలు చేయడమేకాక, పలువురికి అండగా నిలుస్తున్న పవన్‌కల్యాణ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన స్టార్ క్యాంపయినర్ సాగర్(ఆర్‌కే నాయుడు) తెలిపారు. ఒక వ్యక్తిగా ఇంత చేసిన పవన్ వ్యవస్థకు ప్రతినిధిగా ఉంటే ఎంత చేయగలరో ఆలోచించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు పి.భవానీకుమార్, ఏడిద శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, కృష్ణప్రసాద్, రవికుమార్, చంద్రశేఖరరెడ్డి, బైరు వెంకన్నగౌడ్, రమేష్‌నాయుడు, కోపల్లి శ్రీనివాస్, జి.కొండలరావు పాల్గొన్నారు.



సందర్శకులతో కిక్కిరిసిన సాగరతీరం

బీచ్‌లో సందర్శకుల సందడి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 14: కాకినాడరూరల్ సూర్యారావుపేట సాగర తీరం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం సెలవు దినం కావడం, వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వేసవి తాపం నుంచి సేదతీరేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున సందర్శకులు, చిన్నారులతో కుటుంబ సభ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సముద్రంలో జలకాలాటలు ఆడుతూ యువత, పెద్దలు ఎంజాయ్ చేశారు. చిన్నారులు సముద్ర తీరంలో సముద్ర ఇసుకలో ఆటపాటలాడుతూ, కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తీరంలో గస్తీ నిర్వహించారు.

శ్రీ ప్రకాష్‌లో జీవన తరంగిణి పుస్తకావిష్కరణ



తరంగిణి పుస్కకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

తునిరూరల్, ఏప్రిల్ 14: బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పశుపోషక శాస్త్ర విజ్ఞాన కవి డాక్టర్ యెలినేని రాఘవరావు జీవన తరంగిణి పుస్తకావిష్కరణ, సన్మాన వేడుక ఆదివారం అట్టహాసంగా జరిగింది. శ్రీ ప్రకాష్ విద్యాసౌధంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రిటైర్డ్ డాక్టర్ మన్మోహన్ సింగ్, గౌరవఅతిథులుగా విచ్చేసిన ఇక్రిశాట్ సీనియర్ సైంటిస్ట్(రిటైర్డ్)డాక్టర్ రవిందర్ రెడ్డి, పశు సంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం రాఘవరావు సేవలను కొనియాడారు. పశు పోషకులను సమాజంలో గౌరవంగా నిలబెట్టేందుకు రాఘవరావు చేసిన కృషి అమోఘమని స్ఫూర్తిదాయకమైన జీవనానికి చిరునామా డాక్టర్ రాఘవరావు అని పేర్కొన్నారు. రాఘవరావు అందించిన సేవలు, పరిశోధనలు ఎంతోమంది పాడి రైతుల తరుపున ఆయనకు కృతజ్ఞతగా ఆయన జీవన గమనంపై ఒక పుస్తక రూపకల్పన చేయాలనే ఆలోచనకు ప్రతి రూపమే ఈ జీవన తరంగిణి అని తెలిపారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ వీకే నరసింహారావు మాట్లాడుతూ కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడి రుజువు పరిచేటట్లుగా ఆయా రంగాల్లో నీతి నిజాయితీలతో పనిచేసిన వ్యక్తులను సత్కరించుకోవడం పరిపాటి అని అన్నారు. తాను ఎన్నుకున్న తన కోసం కాకుండా పాడి రైతుల కోసం పాటుపడే డాక్టర్ రాఘవరావు అందించిన సేవలు అభినందనీయమని పాడి రైతుల తరుపున ఆయనకు కృతజ్ఞతగా ఒక పుస్తకం రూపకల్పన చేయాలనే ఆలోచనకు కార్యరూపం దాల్చి జీవన తరంగిణి అనే పుస్కకావిష్కరణ కార్యక్రమం నేడు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాబార్డు రిటైర్డ్ సీజీఎం పి.మోహనయ్య, డాక్టర్ కె. నరేంద్రబాబు, పంజ్‌బదానా, డాక్టర్ వి. రవీంద్రబాబు, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, డాక్టర్ సింహాచలం, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్లు, మెంబర్లు, గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.



అల్లవరం: గూడాలలో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ఇళ్లు

గూడాలలో అగ్ని ప్రమాదం

» మూడు తాటాకిళ్లు దగ్ధం » రూ.9లక్షల ఆస్తి నష్టం

» నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలు

అల్లవరం, ఏప్రిల్ 14: వారి ఆశలు కళ్లెదుటే కాలి బూడదయ్యాయి. అర్ధరాత్రి ఎగసిపడ్డ మంటలకు భయపడి పిల్లాపాపలతో పరుగులు తీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గూడాల పుల్లయ్యచెరువు గట్టు వద్ద శనివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆకుల వెంకట్రావు, ఆకుల సత్యనారాయణ, ఆకుల మంగతాయారు నివసిస్తున్న తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు కుటుంబాల వారు కట్టుబట్టలతో బయటపడ్డారు. అదే ఇంట్లో ఉంటున్న దొడ్డా సత్యవతి నిరాశ్రయురాలైంది. వెంకట్రావు ఇంట్లో టీ కాచేందుకు గ్యాస్ వెలిగించగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరిగిందని చెబుతున్నారు. 8వ తరగతి చదువుతున్న బాలిక గమనించి అందరి ప్రాణాలు కాపాడింది. అమలాపురం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి చివరి క్షణంలో మంటలను ఆర్పివేసింది. గంధం పల్లంరాజు, పోలిశెట్టి నాయుడు బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.30వేలు సాయం అందజేశారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఆర్.నానిరాజు, కొనుకు బాపూజీ, దాకారపు చిరంజీవి బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5వేలు వంతున ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. టీడీపీ నేతలు అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, దెందుకూరి సత్తి బాబురాజు, పంపిరెడ్డి కాశీ బాధితులకు రూ.22వేలు అందజేశారు. పొలిశెట్టి భాస్కరరావు, తాటికాయల సుధీర్, రాసూరి రాంబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

స్మార్ట్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖ

» సెల్‌ఫోన్ షాపు యజమాని వినూత్నంగా పెళ్లి కి ఆహ్వానం



సెల్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖను త యారు చేసిన దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 14: వినూత్న ఆలోచనలతో ఎవరి అభిరుచికి తగినట్లు వారు శుభలేఖలు తయారు చేయించుకుంటున్న కల్చర్ ఈ మధ్య ఎక్కువైంది. కాలానుగుణంగా శుభలేఖల ముద్రణలో కొత్త ఒరవడి ఎప్పటికప్పుడు నడుస్తోంది. దీనిలో భాగంగా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంనకు చెందిన మొబైల్ షాపు రిపేర్ యజమాని గ్రంధి మణికంఠ వినూత్న ఆలోచనలతో తన పెళ్లి శుభలేఖను తానురోజు రిపేరుచేసే సెల్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖను తయారు చేయించుకున్నాడు. ముందుభాగంలో వధూవరుల ఫొటోలు, మధ్యలో పెళ్లికి సంబంధించిన వివరాలు, చాటింగ్ మాదిరిగా మెజేస్ రూపంలో పెట్టి, వెనుక భాగంలో క్యూఆర్‌కోడ్‌ను ముద్రించి సుమారు 1000 శుభలేఖలను ముద్రించారు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే పెళ్లి వివరాలు అన్నీ సెల్‌ఫోన్ శుభలేఖలో కనిపిస్తాయి. గ్రంధి రామ్మోహనరావు, సత్యభామ దంపతుల ద్వితీయ కుమారుడు గ్రంధి మణికంఠ, మాధురిల వివాహం ఈనెల 18వ తేదీన భీమవరంలో జరుగుతుందని ముద్రించిన శుభలేఖలను కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు అందించి పెళ్లికి రావాలంటూ ఆహ్వానం పలుకుతున్నాడు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు చెరుకూరివీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

బిక్కవోలులో వివాహిత ఆత్మహత్య



బిక్కవోలులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన చిన్ని

అనపర్తి, ఏప్రిల్ 14: వివాహం జరిగి ఏడాది కాకుండానే ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బిక్కవోలులో జరిగింది. ఎస్ఐ బుజ్జిబాబు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన మద్ది చిన్ని(24)కి, రాజవొమ్మంగి మండలం ఒట్టిగడ్డకు చెందిన ఆవుగడ్డ ప్రసాద్‌తో గత ఏడా ది జూన్‌లో వివాహం జరిగింది. ప్రసాద్ బిక్కవోలు మండలం బలభద్ర పురం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుం డగా చిన్ని బిక్కవోలులో వలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల రాజీనామా చేసింది. శనివా రం రాత్రి భార్యాభర్తలు చెరో గదిలో నిద్రపోయారు. అయితే ఆదివారం ఉదయం చిన్ని గది నుంచి బయటకు రాకపోవడం, తలుపులు లోపలికి గడియవేసి ఉండడంతో ప్రసాద్ ఇంటి యజమానుల సహా యంతో త లుపులు పగులగొట్టి చూడగా ఆమె ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో ప్రసాద్ పోలీసులకు సమాచారం అందించాడు. అలాగే చిన్ని తల్లిదండ్రు లకు సమాచారం అందించడంతో వారు బిక్కవోలు చేరుకుని కుమార్తె మృతదేహం వద్ద విలపించారు. అయితే భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారని ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో అర్థం కావడం లేదని చిన్ని తండ్రి మద్దు వెంకటరమణ రోధిస్తున్నాడు. మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన మేరి(30)కి, చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి డేవిడ్‌రాజుకు 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త డేవిడ్‌రాజు కుటుంబాన్ని సరిగా పట్టించుకోకపోవడంతో మేరీయే పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో శనివారం రాత్రి ఇంటిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మేరీ మృతిపై తండ్రి కాపు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన వాసంశెట్టి లోవరాజు

కరప, ఏప్రిల్ 14: కాకినాడజిల్లా కరప శ్మశానవాటిక సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన వాసంశెట్టి లోవరాజు(35) కాకినాడ పోర్టులో మూటల పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని మోటర్‌సైకిల్‌పై కాకినాడ నుంచి వలసపాకల బయలుదేరాడు. కరప శ్మశానవాటిక సమీపంలోకి వచ్చేసరికి రామచంద్రపురం నుంచి కాకినాడ వెళుతున్న లారీ వేగంగా వచ్చి లోవరాజును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోవరాజును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



దున్నా రవీంద్రనాథ్ రాగూర్

నల్లజర్ల, ఏప్రిల్ 14: నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన దున్నా రవీంద్రనాథ్ రాగూర్(24)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాగూర్ ఆదివారం పొలం పనులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వస్తుండగా బైపాస్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 14: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల సమాచారం మేరకు మండలంలో కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో మర్రిపీడు, తిమ్మాపురం గ్రామానికి చెందిన శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం ఉప్పలపాడు నుంచి తాళ్ళూరు జాతీయ రహదారి ఎక్కుతుండగా వైజాగ్ నుంచి రాజమండ్రి వెళ్లే కారు ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అలాగే పెద్దాపురం గ్రామానికి చెందిన నవుడు కిశోర్, జెడ్ రాగంపేట సర్వీసురోడ్డులో రాంగ్‌రూట్‌లో జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో అతనికి బలమైన గాయాలయ్యాయని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామేశంపేటలో రూ.1.18 లక్షలు పట్టివేత



రంగంపేట: రామేశంపేట చెక్‌పోస్ట్ దగ్గర కారును తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది



తాళ్లరేవు: పి.మల్లవరం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కమిషనర్

రంగంపేట, ఏప్రిల్ 14: తూర్పుగోదావరిజిల్లా రంగంపేట మండలం రామేశంపేట చెక్‌పోస్ట్ వద్ద ఎటువంటి అధికార పత్రాలు లేని రూ.1.18 లక్షలు సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్, మండల మేజిస్ట్రేట్ పి.వెంకటరత్నం ఆదివారం తెలిపారు. కోనాల హశ్వంత్‌రెడ్డి యానాం నుంచి రాజమహేంద్రవరానికి కారులో వెళ్తుండగా రామేశంపేట చెక్‌పోస్ట్‌వద్ద నిర్వహించిన తనిఖీలో ఈ సొమ్మును గుర్తించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కానిస్టేబుల్ జీవీ ఎస్ఎస్ రెడ్డి, చెక్‌పోస్ట్ కానిస్టేబుల్స్ కె.ఆదినారాయణ, జి.వెంకటలక్ష్మి, రంగంపేట ఎస్ఐ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పి.మల్లవరం సెబ్ చెక్‌పోస్టు పరిశీలన

తాళ్లరేవు, ఏప్రిల్ 14: పి.మల్లవరం, సుంకరపాలెం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సెబ్ చెక్‌పోస్టును ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి తనిఖీ చేశారు. యానాం-కాకినాడ రూట్‌లో వాహనాలను పరిశీలించారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద చేసే తనిఖీ విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు టి.సత్యనారాయణ, ఏ.ఎస్. దొర, సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.రామశేషయ్య పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు నీటి విడుదల నిలిపివేత

ఏపీ జెన్కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్



డొంకరాయి జలాశయం వద్ద గేట్లు కిందకు దింపుతున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

మోతుగూడెం, ఏప్రిల్ 14: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జలాశయం నుంచి గోదావరిడెల్టా రబీ పంటలకు శనివారం సాయంత్రం నుంచి నీటి విడుదలను నిలిపివేశామని ఏపీ జెన్కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.విజయ్‌కుమార్ తెలిపారు. సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు గోదావరి డెల్టాకు నీరు చేరుతుందని, అయితే పొల్లూరులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తేనే 3500నుంచి 4వేలు క్యూసెక్కుల వరకు నీరు చేరుతుందని రబీలో మార్చి ఏప్రిల్‌లో అధికంగా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు 7వేల క్యూసెక్కులు అవసరమని విన్నవించడంతో శనివారం సాయంత్రం వరకు డొంకరాయి జలాశయం ద్వారా నేరుగా (విద్యుత్ ఉత్పత్తి లేకుండా)3500 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి లేకుండా ఇప్పటివరకు గోదావరి డెల్టాకు 4248 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో 5నుంచి 6 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన వివరించారు. గోదావరి డెల్టాలోని రబీ పంటలకు సీలేరు నుంచి నీటి విడుదల నిలిపివేశారు. ఈనెల ఒకటినుంచి గోదావరి డెల్టాకు డొంకరాయిజలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈనెల ఒకటి నుంచి 13వ తేదీ వరకు 4,28 టీఎంసీల నీటిని విడుదల చేశారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆధ్వర్యంలో గేట్లు కిందకి దింపించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో లోయర్ సీనియర్ ప్లాంట్‌మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

రాజుపేట గ్రామంలో
ఎమ్మెల్యే ధనలక్ష్మికి నిరసన సెగ



రాజవొమ్మంగి : బరదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామంలో ఎమ్మెల్యే ధనలక్ష్మిని నిలదీస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 14: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి నిరసన సెగ ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి 9.30కు బరదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి వెళ్లగా గ్రామస్థులు గ్రామంలో ఉన్న పలు సమస్యలపై నిలదీశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజుపేట గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, పాఠశాల శిథిలావస్థలో ఉందని ఎన్నిసార్లు అధికారులకు పాలకులకు చెప్పినా పట్టించుకోవట్లేదని పిల్లలు చనిపోతే ఎవ రు బాధ్యులని గ్రామస్థులు ప్రశ్నించారు. గ్రామంలో తాగునీటి సమస్య వెంటాడుతుందని, గ్రామానికి వెళ్లే దారిలో వైసీపీ నాయకులు నాణ్యతలేని కాజ్వే నిర్మించారన్నారు. గ్రామంలో చాలామందికి కుల ధ్రువీకరణ పత్రాలు లేవని తెలిపారు. స్థానిక వైసీపీ నేతలుకలుగజేసుకొని ఆపేందుకు ప్రయత్నం చేశారు.

వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని
తుడిచేసే సమయం వచ్చింది

» జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని తుడిచి వేసే సమయం వచ్చిందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో క్లీన్ పిఠాపురం-గ్రీన్ పిఠాపురం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పురవీధులను చీపుర్లతో శుభ్రపరిచారు. చెత్త మాదిరిగానే వైసీపీని రాష్ట్రం నుంచి శుభ్రం చేయడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య విధానాలతో అన్నివర్గాలకు న్యాయం చేస్తామని తెలిపారు. అంబేడ్కర్ జయంతి రోజున ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్లీన్ పిఠాపురం-గ్రీన్ పిఠాపురం కార్యక్రమంలో రోడ్లు ఊడుస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

కూళ్ల, గంగవరంలో టీడీపీ ప్రచారం

కె.గంగవరం, ఏప్రిల్14: కూళ్ల,గంగవరం గ్రామాల్లోఆదివారం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఇంటింట ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం సమగ్రాభి వృద్ధి చెందా లంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిం చాలని కోరారు. మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, టీడీపీ నాయకులు రేవు శ్రీను, చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, శీరెడ్డి సత్తిబాబు, చిట్టూరి సుబ్రహ్మణ్యం, పెంకే గోవిందరాజు, కొత్తపల్లి మొరార్జీ పాల్గొన్నారు.

- కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన దళిత నాయకులు, కార్యకర్తలు

అందరివాడు అంబేడ్కర్



అమలాపురం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆనందరావు తదితరులు






మండపేట: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ముమ్మిడివరం: నివాళులర్పిస్తున్న దాట్ల బుచ్చిబాబు, ద్రాక్షారామ: నివాళులర్పించిన వాసంశెట్టి సుభాష్, అయినవిల్లి: నివాళులర్పిస్తున్న హరీష్‌మాధుర్ తదితరులు

అమలాపురం టౌన్/రూరల్, ఏప్రిల్ 14: అట్టడుగువర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాజ్యాంగ రచన చేసిన అంబేడ్కర్ అందరివాడని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మెట్ల రమణబాబు, ఇసుకపట్ల రఘుబాబు,పెచ్చెట్టి విజయలక్ష్మి, బత్తుల ప్రసాద్, అల్లాడ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.గడియార స్తంభం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా పూలమాలలవేసి నివాళులర్పించారు. దళిత ఐక్య వేదిక, ఆర్పీఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు డీబీ లోక్, జంగా బాబూరావు, రేవు తిరుపతి రావు, బత్తుల నకులరాజు, మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబు పాల్గొన్నారు. కామనగరువు కరక్కాయపేటలో బీఎస్పీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోలా త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, బట్టు పండు, బండి మణికంఠ పూలమాలలు వేశారు. నడిపూడిలోని బాబూజగ్జీవన్‌రామ్ భవనం వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రాప నాగభూషణం, చాట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. త్రిరత్న బుద్ధవిహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, ఎంఏకే భీమారావు పూలమాలలువేసి నివాళులర్పించారు. అమలాపురం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిని అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిగింది. బండారులంకలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కామన ప్రభాకరరావు అధ్యక్షతన అంబేడ్కర్ జయంతి నిర్వహించగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. మహ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: దళితుల సామాజిక హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టున, తిల్లమ్మ చెరువుగట్టు, తదితర చోట్ల ఆదివారం జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మెత్స చిట్టిరాజు, కాశి బాలమునికుమారి, పితాని బాలకృష్ణ, బొంతు సత్యశ్రీనివాస్, జగతా బాబ్జి, కోలా బాబ్జి, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, పెయ్యల చిట్టిబాబు పాల్గొన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు ముమ్మిడివరం మండల, నగర పంచాయతీ పరిధిలో పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దాట్ల పృథ్విరాజ్ పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో పోలమ్మచెరువుగట్టున అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గుద్దటి జమి, ముత్యాల జయలక్ష్మి, దూడల స్వామి ఉన్నారు. షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, బొజ్జా రమణశ్రీ, కాశి వెంకటాచార్య, జనిపల్లి బాలకృష్ణ, పి.డేనియల్, నక్కా శ్రీనివాస్,జనిపల్లి సత్యనారాయణ, ఎస్.అబ్బులు, పాము ఆనందరావు పాల్గొన్నారు. జైబుద్ధ పార్కులో జరిగిన జయంతి కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, దోనిపాటి ఆంజనేయులు, కన్నీడి వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, జి.శ్రీహరి, ఎం.ప్రవీణ్, జి.సునీత పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. మండలంలో పలు చోట్ల వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరిపారు.

కపిలేశ్వరపురం:అంబేడ్కర్‌ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ కృషిచేయాలని మాలమహానాడు ఉభయ గోదావరి జిల్లాల జిల్లా ప్రధాన కార్యదర్శి మాదే ప్రసాదరావు అన్నారు. కాలేరులో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మత్తాల మధుసూదనరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మాదే ప్రసాదరావు, మత్తాల మధుసూదనరావు, పలువురు నాయకులు, సంఘపెద్దలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కొండలరావు, ఎంపీటీసీలు, మండలపరిషత్ సిబ్బంది, స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.సర్పంచ్ దాయం కావేరి శేఖరబాబు, దళిత నాయకులు పెయ్యల ఏకోబు, నాతి చంద్రశేఖర్, సురేష్, బక్కి సతీష్, వీర్రాజు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అయినవిల్లి: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అమలాపురం పార్లమెంటరీ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి సందర్భంగా అయినవిల్లి, చింతనలంక గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో చిట్టూరి శ్రీనివాస్, వస్కా శ్యామ్, పెంద్ర రమేష్ పాల్గొన్నారు.

మామిడికుదురు: అంబేడ్కర్ జయంతిని ఆదివారం వాడవాడలా నిర్వహించారు. మామిడికుదురులో టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, దళిత నాయకులు, ఉద్యోగ సంఘాల సభ్యులు, అంబేడ్కర్ అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పాశర్లపూడిలోని పరివర్తన్ స్థల్ వద్ద మాతా రమాబాయి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించి కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. పాశర్లపూడిలోని కొండాలమ్మ చింత వద్ద వైసీపీ నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. బి.దొడ్డవరంలో అంబేడ్కర్ విగ్రహానికి ఏసీపీ మోకా సత్తిబాబు ఆవిష్కరించారు. ఆయాకార్యక్రమాల్లో పార్టీ నాయకులు, అంబేడ్కర్ అభిమానులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: అంబేడ్కర్‌జయంతిని వాడవాడలా జరుపుకున్నారు. కరవాకలంకలో జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, టి.కొత్తపల్లి పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారిణి టి.జ్యోతిర్మయి పాల్గొన్నారు. రేవు శ్రీను, దుక్కిపాటి సత్యనారాయణ, ములపర్తి శ్రీనుబాబు, ఎలిపే రామకృష్ణ, ఎలిపే రాజేష్, బొమ్మిడి సత్యనారాయణ, నక్కా సుబ్బారావు, దుక్కిపాటి విజయచంద్ర, ఆర్ఎస్ఎఫ్ యూత్ పాల్గొన్నారు.

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని రాజోలు అసెంబ్లీ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. దిండి, మలికిపురం, విశ్వేశ్వరాయపురం, లక్కవరం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బందెల పద్మ, ముదునూరి చినబాబురాజు, గుండుబోగుల పెదకాపు, రాపాక నవరత్నం, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, దిరిశాల బాలాజీ, ఉండపల్లి అంజి, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ పరిరక్షణ చైతన్యసమితి సభ్యులు నల్లి ప్రసాద్, ముత్యాల శ్రీనివాసరావు, విప్పర్తి సాయిబాబా, పోతుల శేఖర్‌నాథ్, చవ్వాకుల వెంకట్, రాపాక రత్నరాజు పాల్గొన్నారు

అంతర్వేది: సఖినేటిపల్లి, అప్పనరామునిలంక, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కొత్తపేట, కేశవదాసుపాలెం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరామల్లిబాబు, అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సఖినేటిపల్లి మూడు తూముల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాడి మోహన్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుండుబోగుల పెద్దకాపు, ఉండపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: కొమరగిరిపట్నంలో ఎంపీ చింతా అనురాధ, కోడూరుపాడులో మంత్రి విశ్వరూప్, గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఓడలరేవులో కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, బెండమూర్లంకలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. గోడి, దేవగుప్తం, గోడిలంక గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్‌లు సాధనాల వెంకట్రావు, వడ్డి సుభాషిణి, దాకారపు చిరంజీవి, రొక్కాల విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీను, నాతి శ్రీనివాసరావు, పిండి మాచరయ్య, చింతా రామకృష్ణ పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ర్యాలిలో అంబేడ్కర్ విగ్రహానికి కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడిఅభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మెర్లపాలెంలో సర్పంచ్ మెర్ల రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆత్రేయపురంలో సర్పంచ్ గెడ్డం సుధ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పాలంగి రవిచంద్ర ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిపారు. అంబేడ్కర్ యువజన సంఘాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి.

కాట్రేనికోన: చెయ్యేరు పంచాయతీ వద్ద కార్యదర్శి శ్రీనివాస్, కందికుప్ప, పల్లంకుర్రు, చెయ్యేరు, ఉప్పూడి, గెద్దనపల్లి, కొప్పిగుంట, నడవపల్లి, కుండలేశ్వరం పంచాయతీల్లో కార్యదర్శులు ఎంటీపీ వర్మ, పోలిశెట్టి వి.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, భాగయ్య, జి.రవికుమార్, వి.వెంకటరమణ, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీదేవి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ నాగేశ్వరరావు, విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈ బి.నాగేశ్వరరావు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వైద్యాధికారులు నీలిమ, బి.స్వాతి, బీజేపీ మండల అధ్యక్షుడు మట్టా సూరిబాబు, ఎఫ్‌డీవో రామకష్ణ, ఏపీవో శ్రీనివాస్, ఏవో ప్రవీణ్, కాపునాడు కన్వీనర్ సంధ్యాల చంటి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీపీ పి.లక్ష్మీధర్మారావు, నల్లా నరసింమూర్తి, నడింపల్లి సూర్యనారాయణరాజు, సర్పంచ్‌లు గంటి వెంకటసుధాకర్, చెల్లి సురేష్, నాతి అలివేణి, చలగల వెంకటలక్ష్మి, కముజు వెంకటలక్ష్మి, దంతులూరి సీతారామకృష్ణంరాజు, దొమ్మేటి పల్లవి, నాయకులు ఏడిద చక్రం, ఏడిద సుబ్బి, చల్లగల అప్పారావు, నాతి సత్యనారాయణ పాల్గొన్నారు.

మండపేట: దేశంలో అణగారిన వర్గాల ఆశా జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. దివారం పట్టణంలో న్యూకాలనీ, ఎస్సీ కాలనీల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక నేతలతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరాచీ సెంటరులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ మాజీచైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పూలమాలలు వేసినివాళులర్పించారు. మండపేట పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజు, బుంగ సంజయ్, మాజీ కౌన్సిలర్ మందపల్లి చంద్రశేఖర్, వల్లూరి ఇందిరా పాల్గొన్నారు. వైసీపీ పట్టణ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అంబేడ్కర్ చిత్రపటానికి స్థానిక నేతలతో కలిసి నివాళులర్పించారు. నియోజకవర్గంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో స్థానిక నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. కరాచీ సెంటరులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక నేతలు కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబాజీపేట:అంబాజీపేట సెంటర్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా పలువురు నాయకులు కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. అంబేడ్కర్ విగ్రహాలకు ఆయా గ్రామాల నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, కె.పెదపూడి గ్రామాల్లో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నాయకులు జంగా గౌతమ్, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కూళ్ల గ్రామంలో జరిగిన వేడుకల్లో టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, పామర్రు, యర్రపోతవరం గ్రామాల్లో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు. పామర్రులో సర్పంచ్ వాసంశెట్టి సూరిబాబు, బాలాంత్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయవరం: బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు మండలంలో వాడవాడలా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకులు, పలువురు గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం పట్టణంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బార్ అసోసియేషన్ హాలులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ అధ్యక్షతన జరిగిన జయంతి వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటానికి సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్, ఇతర కార్యవర్గసభ్యులు న్యాయవాదులుపాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనరు బి.శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మెయిన్ రోడ్డులో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఏజీటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వుండవిల్లి గోపాలరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మోడరన్ విద్యా సంస్థలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిపారు. హసన్‌బాదలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు పాల్గొన్నారు. యానాం సెంటర్‌లో కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ యానాం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

పి.గన్నవరం: పి.గన్నవరం మూడురోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలువేసి నివాళులర్పించారు. వైసీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంసాని పెద్దిరాజు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, సర్పంచ్ బొండాడ నాగమణి, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, వప్పుల సాయిబాబు, యడ్ల ఏసు, షేక్ దొరబాబు, పెచ్చెట్టి ఈశ్వర్ పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పూలమాలలువేసి నివాళులర్పించారు. బి.సావరంలో అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, తాటిపాక సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత చైతన్యవేదిక నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, చిలకపాటి శ్రీధర్, బత్తుల జనార్ధనరావు, బొంతు మణిరాజు, తెన్నేటి నాగేశ్వరరావు, జిల్లెల్ల వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: టీడీపీ మండల శాఖ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు బండారు సంజీవ్, మాసాబత్తుల ఆనందరావు, చిలువూరి సతీష్‌రాజు, కోనాల అంబేడ్కర్, కాసా విజయసాగర్, జక్కంపూడి వెంకటస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోనసీమ ముఖద్వారం వద్ద ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు.

ఉప్పలగుప్తం: అంబేడ్కర్ జయంతిని మండల వ్యాప్తంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, చీకట్ల ఏసు, పెయ్యల దుర్గారావు, బూసి బుజ్జిదొర, కాగిత సత్యనారాయణ, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఉద్యానవన విశ్వవిద్యాలయం డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, జనసేననాయకులు ఆకుల సూర్యనారాయణమూర్తి, సలాది నాగరాజు, మంచెం బాలకృష్ణ, పైబోడి పండు, గనిశెట్టి కిశోర్, పిల్లా సాయిత్రివిక్రమ్, చిక్కం సాయి, గనిశెట్టి వీరు, సలాది తాతారావు పాల్గొన్నారు.

యానాం: స్థానిక పాతబస్టాండ్, అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌తో పాటు పలు గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మలాడి శామ్యూల్, నాయకులు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. పలు అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, బీజేపీయానాం అధ్యక్షుడు కనకాల రాజు, నాయకులు అభిమానులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

కొత్తపేట: పాతబస్టాండు సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ యువనాయకుడు బండారు సంజీవ్ పూలమాల వేశారు. దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, పల్లి శాంతి, ముత్యాల బాబ్జీ, బీర ఇసాక్, గుబ్బల మూర్తి, దర్నాల రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్, ముద్రగడ సుబ్బారావు, అద్దంకిచంటిబాబు, దేవపాటి వెంకటేశ్వరావు, పెనుమళ్ల అన్నవరం పాల్గొన్నారు.

సంఘ సంక్షేమమే సాహిత్యం లక్ష్యం కావాలి

అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



ప్రముఖులకు నివాళులర్పిస్తున్న అరసం జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 14: సంఘ సంక్షేమమే సాహిత్యం లక్ష్యం కావాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశ్వశ్రేయస్సును కాంక్షిస్తూ ప్రజాభ్యుదయమే లక్ష్యంగా 'అరసం' పనిచేస్తుందన్నారు. బండారులంక వీఎస్ఎం షాపింగ్ మాల్ ప్రాంగణంలో అరసం జిల్లా తొలి మహాసభను జిల్లా శాఖ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సంఘ కన్వీనర్ గండి స్వామిప్రసాద్ అతిథులకు స్వాగతం పలికారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తిపంతులు చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా సాహితీ వేత్తలంతా సమష్టి కృషి చేయాలన్నారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సంగమం సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్ చంద్రజ్యోతిశ్రీ, రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జునసాగర్ సాహిత్యంపై ప్రసంగించారు. జిల్లాకు చెందిన కవులు ఆధునిక, సామాజిక అంశాలపై, కవితలపై చదివి వినిపించగా వారిని నిర్వాహకులు సత్కరించారు. అభ్యుదయ గీతాలు ఆలపించారు. అరసం జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా గండి స్వామిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జేవీఎల్ నరసింహారావులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దాట్ల దేవదానం రాజు, డాక్టర్ చల్లా రవికుమార్, ఉపాధ్యక్షులుగా మాడా రాము, నేరేడుమిల్లి అబ్బులు, కార్యవర్గ సభ్యులుగా రాయుడు త్రినాథరావు, నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, పినిపే సత్యనారాయణ, గొర్రెల రాము, కవి శ్రీనాగేంద్రస్వామి,ఖాజా మొహిద్దీన్, కొండేపూడి వినయ్‌కుమార్, బి.సాంబమూర్తి, గిడ్డి ప్రకాశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సానుభూతి డ్రామాలను ప్రజలు నమ్మరు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 14: సానుభూతి డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. సీఎం జగన్‌పై జరిగిన దాడిపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి అందుకు బాధ్యులైన అధికారులందరిపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు.

కాలం చెల్లిన డ్రామాలను ప్రజలు నమ్మరు

కొత్తపేట, ఏప్రిల్ 14: సీఎంజగన్ ఎన్నికల ప్రచారానికి స్పందన కరువవ్వడంతో కాలంచెల్లిన డ్రామాలు ఆడుతున్నారని, దీనిని ప్రజలు నమ్మరని అసెంబ్లీ కూటమి ఉమ్మడిఅభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్‌అన్నారు. ఏనుగులమహల్‌లో సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు.

కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఏప్రిల్14: మండపేట నియోజకవర్గంలో కూటమిఅభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయమే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ముక్తకంఠంతో చెప్పారు. వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు ఓటమే లక్ష్యంగా పనిచేసి, ఎక్కడనుంచి వచ్చారో అక్కడికే ఆయనను పంపిస్తామని కూటమి నేతలు అన్నారు. మండపేట-ఆలమూరు రోడ్డులో ఉన్న బాబు అండ్‌బాబు కన్వెన్షన్ హాలులో ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ వేగుళ్ల లీలాకృష్ణ అధ్యక్షతన కూటమి శ్రేణులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి నియోజకవర్గంలో ఉన్న మూడు పార్టీల ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కూటమి శ్రేణులను కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని భరోసాఇచ్చారు. ఎన్నికల్లో కూటమి సభ్యులంతా తన గెలుపు కోసం పనిచేయాలన్నారు. గెలిచిన తర్వాత అందర్ని కలుపుకుని వారి కష్టనష్టాలో వెన్నంటి ఉంటానని చెప్పారు. ఎన్నికల ప్రచారం కోసం జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ త్వరలో మండపేట వస్తారని ఆయన చెప్పారు. జనసేననియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాలతో జనసేన క్యాడర్ అంతా కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు గెలుపు కోసం పనిచేస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి మాట్లాడుతూ కూటమి గెలుపు ద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి సాయిరాం మాట్లాడుతూ కూటమి గెలుపు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులును ఇక్కడ నుంచి ఓడించి పంపిస్తామన్నారు. మరోనేత బుంగ సంజయ్, టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ ఇబ్రహీం మాట్లాడారు. తొలుత కూటమి నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆత్మీయ సమావేశంలో కూటమి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, వాదా ప్రసాదరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఉండ మట్ల రామారావు, దేవు వెంకట్రాజు, కోన సత్యనారాయణ, రాంబాబు, సరాకుల అబ్బులు, కుంచేదుర్గాప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యర్తలు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వెంకట కృష్ణప్రసాద్

పి.గన్నవరం, ఏప్రిల్14: టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు పలువురికి పదవులు కేటాయించారు. పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలో మానేపల్లికి చెందిన బోళ్ల వెంకటకృష్ణప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకటించారు.

పేదింటి యువతి వివాహానికి సహకారం

మలికిపురం, ఏప్రిల్ 14: పేదింటి యువతి వివాహానికి మానవతా మూర్తులు స్పందించి రూ.75,170 అందజేశారు. ఆదివారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో యువతి తల్లిదండ్రులకు ఆ మొత్తాన్ని నిమ్స్ ఆసుపత్రి సూపర్‌వైజర్ చిట్టాల రాము అందించారు.

నగర పంచాయతీని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతా



వైసీపీ నాయకుడు సత్యనారాయణ టీడీపీలో చేరగా ఆహ్వానిస్తున్న దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, ఏప్రిల్ 14: ముమ్మిడివరం నగర పంచాయతీని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతానని ముమ్మిడివరం అసెంబ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీలోని 8, 9, 12, 14, 15 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమై ఓట్లు అభ్యర్థించారు. తొలుత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పోలమ్మ చెరువుగట్టున ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రచారం నిర్వహించారు. మే13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. నగరపంచాయతీలోని పలు వార్డుల్లో మహిళలు హారతులతో స్వాగతం పలికారు. 12వవార్డులో కౌన్సిలర్, దివంగత భీమవరపు విజయ్ మాతృమూర్తి పుష్పరత్న అనసూయ కుటుంబ సభ్యులు అనుచరులతో వైసీపీ నుంచి టీడీపీలో చేరగా వారికి కండువాకప్పి ఆహ్వానించారు. 14వవార్డులో వైసీపీకి చెందిన గళ్లా సత్యనారాయణ టీడీపీలో చేరగా బుచ్చిబాబు కండువాకప్పి ఆహ్వానించారు. గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, వేగిరౌతు రాజబాబు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, కట్టా సత్తిబాబు, ములపర్తి బాలకృష్ణ, అడబాల సతీష్, దాట్ల బాబు, కడలి నాగు, దివి మహలక్ష్మి, మాదాల బుజ్జి, దూడల స్వామి, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మల్లేశ్వరి, పెదపూడి రుక్మిణి, గిడ్డి రత్నశ్రీ, చిక్కాల అంజిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను రాష్ట్ర ప్రజలు నమ్మరు

మలికిపురం, ఏప్రిల్ 14: జగన్మోహన్‌రెడ్డి డ్రామాలను రాష్ట్ర ప్రజలు నమ్మరని రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం లక్కవరంలో జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబురాజు ఇంటి వద్ద జరిగిన నియోజకవర్గ టీడీపీ సమావేశంలో పలువురు మాట్లాడారు.

ప్రభుత్వం సహకరిస్తే మే నెలలో రీజెన్సీని ప్రారంభిస్తా

యానాం, ఏప్రిల్ 14: యానాంలో రీజెన్సీ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమ పునఃప్రారంభానికి ప్రభుత్వం, ప్రజలు సహకారం అందించాలని రీజెన్సీ సంస్థల చైర్మన్ జీఎన్‌నాయుడు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమ పునఃప్రారంభించడానికి యాజమాన్యం కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టడానికి అన్నిచర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం పరిశ్రమకు గ్యాస్ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, యానాం ప్రజాపనుల శాఖ అనుమతి వచ్చిన వెంటనే పరిశ్రమకు పైప్‌లైన్ వెళ్తుందన్నారు. ప్రభుత్వ అనుమతులు, ప్రజలుసహకరిస్తే మే నెల నుంచే ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. చాంబర్‌ఆఫ్ కామర్స్ ప్రతినిధి ఈల ప్రోలు విష్ణువర్ధనరావు, రీజెన్సీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.మోహన్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పి.గన్నవరం, ఏప్రిల్ 14: రాజులపాలెం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోతవరానికి చెందిన గుత్తుల శ్రీనివాస్ పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనంపై నరేంద్రపురం వైపు నుంచి ముంగండ వైపు వస్తున్న అంబాజీపేట మండలం ఇసుకపూడి శివారు మేరకపేటకు చెందిన విప్పర్తి సంపదరావు(30) రాజులపాలెం ఓఎన్‌జీసీ సైటు వద్ద వెనుక నుంచి గుత్తుల శ్రీనివాస్‌ను ఢీకొట్టాడు. దీంతో సంపదరావు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ పక్కనే ఉన్న తుప్పల్లోకి పడిపోవడంతో కాలికి గాయమైంది. ఎస్‌ఐ బి.శివకృష్ణ చేరుకుని చికిత్స నిమిత్తం శ్రీనివాస్‌ను అమలాపురం తరలించి వివరాలు సేకరిస్తున్నారు.

బీసీల సంక్షేమమే కూటమి లక్ష్యం

అల్లవరం, ఏప్రిల్ 14: బీసీల సంక్షేమమే కూటమి లక్ష్యమని అమలాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఓడలరేవులో కొల్లు విష్ణుమూర్తి అధ్యక్షతన టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో ఆదివారం 'జయహో బీసీ' సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు పాలనకు రోజులు దగ్గరపడ్డాయని బీసీలంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు మాట్లాడుతూ ఓటర్లు అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. ఓడలరేవుకు చెందిన పలువురు యువకులు టీడీపీలో చేరారు. అగ్నికుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, చింతా శ్రీనివాస్, కడలి వెంకటేశ్వరరావు, లంకే భీమరాజు, కొప్పాడి వెంకటరామకృష్ణ, గెద్దాడ శ్రీను, నార్గన శ్రీను, మందపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం

ఐ.పోలవరం, ఏప్రిల్ 14: వీరేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో రుద్రహోమం నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం అనంతరం పూర్ణాహుతి జరిగింది. సుబ్రహ్మణ్యం దంపతుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి పర్యవేక్షణలో 15మంది రుత్విక్కుల ఆధ్వర్యంలో ఈపూజ నిర్వహించారు. గణపతి పూజ, మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అనంతరం బిల్వార్చన, వేదాశీర్వచన కార్యక్రమాలు జరిగాయి.

యానాంలో అన్నాడీఎంకే అభ్యర్థి పర్యటన

యానాం, ఏప్రిల్ 14: పుదుచ్చేరి లోక్‌సభ అన్నాడీఎంకే అభ్యర్థి తమిళ్వేందన్, పుదుచ్చేరి పార్టీ కార్యదర్శి అన్బలగన్ యానాంలో పర్యటించారు. యానాం శాఖ కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్ నేతృత్వంలో యానాంలో ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వాలు ప్రజలకు కనీస అవసరాలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. యానాంలో జరుగుతున్న పలు అక్రమాలపై వివరించారు. కనకాలపేట నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

